ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 3,31,354 మంది ఓటు వినియోగం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును చేవెళ్లలో నిర్వహించనున్నారు. ఏడు నియోజక వర్గాలకు చెందిన ఓట్లను లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం 6,12,170 మంది ఓటర్లు ఉండగా 3,31,354 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 14 టేబుళ్లను ఒక ప్రాంగణంలో.. 14 టేబుళ్లను మరో ప్రాంగణంలో సిద్ధం చేశారు. మొత్తం 20 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపును పూర్తి చేయనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఏజెంట్లకు పాస్‌లను పంపిణీ పూర్తి చేశారు. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు ఓట్ల లెక్కింపు కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వారందరికి అధికారులు పాస్‌లను అందించారు.

మొదట బ్యాలెట్ పేపర్లు..

చేవెళ్ల పార్లమెంటు ఓట్ల లెక్కింపు బ్యాలెట్ పేపర్లతో ప్రారంభం కానుంది. పార్లమెంటు పరిధిలోని రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, తాండూర్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన 3,084 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించారు. మొదట ఈ పోస్టల్ బ్యాలెట్‌ను, అనంతరం ఈవీఎంల ఓట్లను లెక్కిస్తారు. 3,084 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండటంతో గంటన్నర లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో దశాబ్ది వేడుకలు



జెండావిష్కరణ చేసిన జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

శంషాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలను పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేయడంతో పాటు దేశంలో తెలంగాణను నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. అనంతరం తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు గణేష్‌గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, జెడ్పీటీసీ తన్వీ కౌన్సిలర్లు మేకల వెంకటేష్, కుమార్, అజయ్, రేఖ, విజయలక్ష్మీ, నాయకులు తోకల మురళి, మంచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో బృందం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వీడి శిథిలావస్థకు చేరిన ఇళ్లపై దృష్టి సారించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సోమవారం డివిజన్‌లోని బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతంలో ప్రహరీ కూలి ఇద్దరు బాలికలు మృతి చెందగా మరో ముగ్గురు చిన్నారులు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఘటన జరిగిన తీరును రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు సర్కిల్ పరిధిలో ఉన్న శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి తొలగించాలన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చాంద్రాయణగుట్ట: విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం ..గౌలిపురా మేకలమండి ప్రాంతంలో వేణుగోపాల్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాడు. పిల్లర్ గుంతలో నుంచి నీరు తొలగించడానికి సోమవారం ఉదయం వేణుగోపాల్ లాల్‌దర్వాజా మోడ్ వద్ద లేబర్ అడ్డా నుంచి వట్టెపల్లికి చెందిన షేక్ సాజిద్ (31)ను తీసుకొని వెళ్లాడు. పిల్లర్ గుంతలో చేరిన నీటిని మోటార్‌తో తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో నీటితో నిండిన పిల్లర్ గుంతలో పడి మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్రా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న ఛత్రినాక పోలీసులు వివరాలను సేకరించి ఇంటి యజమానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు 21వ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్(ఐసీఎస్‌ఏ)–2024 పేరిట సదస్సును నిర్వహిస్తారు.మంగళవారం నుంచి 8 తేదీ వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. ఈ సదస్సుకు ట్రిపుల్‌ఐటీ ఎస్ఈఆర్‌సీ నుంచి డాక్టర్ వై రఘురెడ్డి, యూఎస్‌ఏలోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ నెనాద్ మెద్విడోవిక్ అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 150 మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కాలనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ నీరజా కాలనీ, గుడిమల్కాపూర్ బాలాజీనగర్‌కు చెందిన కాలనీల ప్రతినిధులు ఆయనను కలిశారు. తమ కాలనీ అభివృద్ధికి కృషి చేసినందుకు వారు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. గత పదేళ్ల నుంచి కాలనీలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులను చేసిపెట్టారని వర్షాకాలంలో సైతం వరద నీరు రోడ్లపై నిలవ ఉండకుండా ప్రత్యేకంగా వరద నీటి పైప్‌లైన్‌లు వేయడంతో తమకు వరద నీటితో తిప్పలు తప్పాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

అనధికారిక విద్యుత్ కోతలు..

అంధకారంలో గ్రామాలు!

- గాలి వీచినా.. చినుకు పడితే కరెంటు బంద్
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



నర్కూడలోని సబ్‌స్టేషన్

శంషాబాద్ రూరల్: చినుకు పడినా.. గాలి వీచినా.. కరెంటు సరఫరాలో ఆటంకాలు.. వీటికి తోడు అనధికారికంగా చేపడుతున్న పనులతో కరెంటు నిలిచిపోతుండడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నర్కూడ సబ్ స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ కోతల కారణంగా రైతులకు అవస్థలు తప్పడం లేదు. కరెంటు సరఫరా నిలిచి రాత్రిళ్లు గ్రామస్తులు అంధకారంలో గడపాల్సి వస్తుంది. మండలంలోని చిన్న గోల్కొండ వద్ద ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాల్లో ఉన్న సబ్ స్టేషన్‌లకు సరఫరా అవుతుంది. మండల పరిధిలోని శంషాబాద్, పెద్దషాపూర్, శంకరాపురం, మల్కారం, నర్కూడ, జూకల్ సబ్‌స్టేషన్‌లతో పాటు మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ సబ్ స్టేషన్‌లకు ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే తరచూ సరఫరాలో అంతరాయం కలిగి జనాలకు ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా నర్కూడ, మల్కారం, అమ్డాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో కరెంటు కోతలు ఎక్కువయ్యాయని రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజు మొత్తం అంతరాయం..

వేసవి కారణంగా జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా.. ఇదే సమయంలో కరెంటు సరఫరా నిలిచి జనాలు అవస్థలకు గురవుతున్నారు. కొన్నిసార్లు రాత్రి వేళల్లో పూర్తిగా కరెంటు సరఫరా లేక నానా తంటాలు పడుతున్నారు. నర్కూడ, చౌదరిగూడలో ఆదివారం రాత్రి 10 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు సరఫరా నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. నర్కూడ సబ్‌స్టేషన్ పరిధిలోని కవ్వగూడ, కాచారం, సుల్తాన్‌పల్లి, రాయన్నగూడ గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 33కేవీ ఫీడర్‌ల ద్వారా విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గత పది రోజులుగా తొలగిస్తున్నారు. అయినా కూడా రాత్రి వేళల్లో కరెంటు సరఫరా నిలిచిపోతుండడం అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బడాబాబుల ఫాంహౌజ్‌లకు లైన్లు..

బడాబాబుల ఫాంహౌజ్‌లు, రిసార్ట్‌లకు ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ లైన్లను ఇష్టానుసారంగా ఏర్పాటు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నర్కూడ సబ్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పల్లి ప్రాంతంలో ఇటీవలే ఓ రిసార్ట్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు, సమీపంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను వర్క్ ఆర్డర్ లేకుండా అనధికారికంగా ఎల్‌సీ తీసుకుని పనులు చేసినట్లు సమాచారం. నర్కూడలోని హనుమాన్ ఆలయం వద్ద కూడా ఓ ఫాంహౌజ్‌కు ఇదే తరహా ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు తెలిసింది. ఇలా అనధికారికంగా కరెంటు కోతలు విధిస్తూ అధికారులు జేబులు నింపుకుంటూజనాలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

చెట్ల కొమ్మల తొలగింపుతో కరెంటు సరఫరాలో ఇబ్బందులు ఏర్పకుండా చూస్తున్నాం. అనుమతి లేకుండా చేపడుతున్న పనులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించిన ఎవరైనా సరే ఉపేక్షించబోం. తమ అనుమతి లేకుండా పనులు చేపడితే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– రత్నాకర్‌రావు, రాజేంద్రనగర్ డీఈ

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి



జైపాల్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ప్రహరీ కూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం బాధాకరమని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: వర్షాకాలం నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రీ-మాన్‌సూన్, మాన్‌సూన్, పోస్టు మాన్‌సూన్ సమయంలో ముందస్తు జాగ్రత్తలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగి పొర్లకుండా చూడాలన్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించి డ్రైనేజీల్లో మట్టి, కవర్లు తదితర వాటిని వేయొద్దని సూచించాలన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, ఆర్‌వో ఈ.మంజులత, ఎస్‌ఐ ఎస్.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తప్పవు



రామిరెడ్డి

అత్తాపూర్: ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ విద్యాశాఖ సూచించిన మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు జూన్ 12 నుంచి పునఃప్రారంభం అవుతాయని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లోని యాజమాన్యాలు విద్యార్థులకు అవసరమైన దుస్తువులు, రాత, పాఠ్య పుస్తకాలు ఇతర స్టేషనరీ సామగ్రి విక్రయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాల పట్ల పేరెంట్స్ కమిటీ విద్యాశాఖకు ఫిర్యాదు చేయాలని, వ్యాపార కేంద్రాలుగా మారిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ డి.రామిరెడ్డి హెచ్చరించారు.

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దు



అధికారులతో సమావేశమైన డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ సిబ్బందితో తగిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశమయ్యారు. వర్షాకాలం సందర్భంగా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. నాలాల్లో వర్షపు నీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను ఇప్పటికే కూల్చివేశామని పురాతన భవనాల్లో ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగు రాష్ట్రాలలోనే అతి పెద్దది. మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం చేవెళ్లలో జరగనుంది. 23 రౌండ్లలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా పురుషులు 4,00,361, మహిళలు 3,57,600, ఇతరులు 141 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా 3,33,181 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల ఓటింగ్ శాతంతో, గత ఎన్నికలతో పోల్చినా 43.91 శాతం తక్కువ ఓటింగ్ నమోదైంది.శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు, గేటెడ్ కమ్యూనిటీల ఓటర్లు ప్రభావం చూపే అవకాశం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ 54 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఒక వైపు మోదీ వేవ్‌తో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మరో వైపు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలకు బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పోటీ ఇస్తారా లేదా అనే అనే చర్చ కొనసాగుతోంది.

వరద నీటితో నిండిన లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి (ఫైల్)





చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌లో వరద నీరు

వర్షాకాలం..

అండర్‌పాస్ ఎలా..?

చిన్నపాటి వర్షం పడితే మూసివేతలు • రాకపోకలకు ఇబ్బందులు

హఫీజ్‌పేట్: చిన్నపాటి వర్షం పడితే చాలు అండర్ బ్రిడ్జిలను మూసివేస్తుండడంతో ట్రాఫిక్ కష్టాలు షురూ అవుతున్నాయి. వర్షాకాలం అండర్ బ్రిడ్జిల కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి వైపు వెళ్ళాలంటే అండర్ బ్రిడ్జిల నుంచి వెళ్లాల్సి ఉంది. మియాపూర్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, బీరంగూడ తదితర ప్రాంతాల ఐటీ ఉద్యోగులు లింగంపల్లి, పాపిరెడ్డి కాలనీ, వైశాలీనగర్‌ల అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తుంటారు. అండర్ బ్రిడ్జి మూసివేసిన తరువాత ఓల్డ్ హఫీజ్‌పేట్, నల్లగండ్ల ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం లింకు రోడ్డు నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా మిగిలిపోయాయి. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి మదీనాగూడలోని జీఎస్ఎం మాల్ వరకు లింక్ రోడ్డు నిర్మించాలని పనులు ప్రారంభించారు. అసంపూర్తిగా మిగిలిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో ముందుస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సంవత్సరం భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్న క్రమంలో ఎమ్మెల్యే గాంధీ అండర్ బ్రిడ్జి విస్తరణతో పాటు ఫ్లైఓవర్ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.


- చందానగర్ హుడాకాలనీ నుంచి పాపిరెడ్డి కాలనీకి వెళ్లే అండర్‌పాస్‌ను చిన్నపాటి వర్షానికే మూసివేశారు.
- వైశాలీనగర్, పాపిరెడ్డి కాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్డు ఇరుకుగా ఉన్నాయి.
- బ్రిడ్జిల కింద ఒకవైపు రోడ్డు, మరో వైపు మురుగు నీటి కాలువ నిర్మించారు. దీంతో వర్షాకాలం రోడ్లు మూసివేతకు ప్రధాన కారణం
- ఇరుకు రోడ్లలోనే నాలాల ఏర్పాటుతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వర్షాలకు గుంతలుగా మారుతున్న అండర్‌పాస్‌లు
- లింకు రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు అండర్ బ్రిడ్జి నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది
- వైశాలీనగర్, చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అండర్‌పాస్‌లను ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.
- మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు మూడు ఫ్లైఓవర్లు, నాలుగు అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. దానిలో రెండు రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్లు ఉండగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు సరిపోవడం లేదు. ఇక మూడు అండర్ పాస్‌లు ఇరుకుగా ఉన్నాయి.

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు వచ్చాయి




ఆర్టీసీ కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేశాం. చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ విస్తరణ చేయాలని అధికారులను ఆదేశించాం.


– ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌లో భారీగా వరద నీరు చేరడంతో బ్రిడ్జిని మూసి వేసిన దృశ్యం



అసంపూర్తిగా ఉన్న శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి జీఎస్ఎం మాల్ లింక్ రోడ్డు పనులు



వైశాలీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద వరద నీరు చేరడంతో బారికేడ్లతో మూసివేసిన దృశ్యం (ఫైల్)